క్లుప్తంగా

టెట్ ఫీజు తగ్గించాలి

ఎర్రవల్లిచౌరస్తా: పెంచిన టెట్ అర్హత పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించాలని సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఒక పరీక్షకు రూ.200 ఉన్న ఫీజును రూ.1000కి, రెండు పరీక్షలకు కలిపి రూ.300 ఉన్న ఫీజును రూ.2000 లకు పెంచారని, దీని వల్ల నిరుద్యోగులు ఇబ్బందులకు గురై ఆందోళన చెందుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన టెట్ అర్హత పరీక్ష ఫీజులను తక్షణమే తగ్గించాలని ఆయన కోరారు.

నేడు రైతులతో వీడియో కాన్ఫరెన్స్

అయిజ: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు సమగ్ర వ్యవసాయం గురించి వివరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రోన్‌లతో వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర వ్యవసాయంపై ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, మండలంలోని రైతులు హాజరు కావాలని ఎంఏఓ కోరారు.

శివాలయంలో అభిషేకం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం పాల్గుణ పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివునికి అభిషేకం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు బీచుపల్లి పుణ్యక్షేత్రంలో శివునికి పంచామృత అభిషేకం చేశారు.

వాహనాల తనిఖీ



మానవపాడు: వాహనాల తనిఖీ ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని కొర్విపాడు స్టేజీ, చంద్రశేఖర్‌నగర్ స్టేజీ, శ్రీనగర్ గ్రామాల్లో వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రూ. 50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని తెలిపారు. బెల్టుషాపుల్లో మద్యం అమ్మరాదని అన్నారు. ఈ వాహన తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని మునుగాలకు చెందిన సీనియర్ నాయకుడు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నలుగురు ఎంపీటీసీలు హైదరాబాద్‌లోని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు జోగుల రవి, ఇస్మాయిల్, వేముల శ్యామ్, యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో సోమవారం ఓపెన్ టోర్నమెంట్ విజేతలకు నిర్వాహకులు నాగేషు, నాగరాజు, మహేష్‌లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడలు మానసిక, శరీరక దృఢత్వాన్ని అందిస్తాయని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొనగా, మొదటి, రెండు బహుమతులు తాండ్రపాడు రూ.15 వేలు, రూ.8వేలు, మూడో బ' హుమతి అనంతపురం జిల్లా జట్టు రూ. 5వేలు గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

అయిజ: మున్సిపాలిటీలోని తుపత్రాలలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్ఐ విజయ భాస్కర్ తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2,900, నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మండలంలోని వెంకటాపురం స్టేజీ వద్ద లావణ్య చికెన్ సెంటర్‌లో అక్రమంగా మద్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో రూ.12,672 విలువైన 11.45 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఉప్పరి గోవిందుపై కేసు నమోదు చేశారు.

బడిలో ఉక్కపోత

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు ఉన్న తిరగని పరిస్థితి. ఒక్కసారైనా తిరుగుతుందని చూస్తూ, కర్రతో తిప్పితే తిరుగుతది. లేదంటే రోజంతా ఉక్కపోతతో కూర్చునే పరిస్థితి. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యను పట్టించుకోవాలని కోరుతున్నారు.



గట్టులో రంగులు చల్లుకుంటున్న మహిళలు



ఏకశిల పాఠశాలలో హోలీ ఆడుతూ సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు



ఉండవెల్లిలో చిన్నారుల హోలీ



గద్వాలలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో..

ఘనంగా హోలీ సంబురాలు



కేటీదొడ్డి: వెంకటాపురంలో హోలీ ఆడుతున్న యూత్ సభ్యులు

అలంపూర్: వసంతాల రంగవల్లి హోలీ సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నియోజవర్గంలోని గ్రామాల్లో హోలీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. అలంపూర్, ఉండవల్లి, మారమునగాల, పుల్లూరు, తక్కశిల, అలంపూర్ చౌరస్తా, బొంకూరు తదితర గ్రామాల్లో హోలీ సంబురాలు చేశారు.

ఆనందోత్సవాలతో హోలీ..

అయిజ: మండల కేంద్రంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు హోలీ పండుగను నిర్వహించారు. చిన్నారులు కేరింతలు కొడుతు రంగులు చల్లుకున్నారు. యువకులు రంగు డబ్బాలతో ర్యాలీ నిర్వహించి స్నేహితులపై రంగులు చల్లుకున్నారు.

గట్టు: ఆనందోత్సవాల మధ్య సోమవారం గట్టు మండలంలోని వివిధ గ్రామాల్లో హోలీ పండుగ ఘనంగా నిర్వహించారు. స్నేహితులు, బావ మరదళ్లు, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ సంబురాలు నిర్వహించారు. లోక కల్యాణార్థమై శివ పార్వతుల కల్యాణం కోసం ప్రాణాలు అర్పించిన కామదేవుడి చిత్ర పటాన్ని ఆదివారం అర్ధరాత్రి



ధరూరులో హోలీ ఆడుతున్న యువకులు

వీధుల్లో ఊరేగించి దహనం చేశారు. గ్రామస్తులు ఈ మంటల నుంచి నిప్పును సేకరించి దీపం వెలిగించుకుని, ఆ వెలుతురును ఇంటిల్లిపాది ప్రసరించేలా చూపించుకున్నారు. ఇలా చేస్తే ఎలాంటి దుష్టశక్తులు దరి చేరవనేది ప్రజల నమ్మకం. గట్టులోని కమ్మరి వీధి, వాకిలిగేరి, కిందిగేరి, చేనేత కాలనీల్లో కామ దహనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వీధులకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో రంగు రంగులతో యువకులు, చిన్నారులు ఘనంగా హోలీ చేశారు. యువకులు పెద్ద ఎత్తున్న ఉత్సాహంగా నిర్వహించారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు వెంకటాపురం, ఇర్కిచేడు, నందిన్నె, కుచినెర్ల, పాతపాలెం వివిధ గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి కాముడి దిష్టిబొమ్మను ఊరేగించారు. యువకులు కేరింతల నడుమ వీధుల్లో దహనం చేశారు. సోమవారం ఒకరిపై రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు, యువతీ యువకులు పెద్దరంగు డబ్బాలతో పట్టుకుని వీధివీధిన తిరుగుతూ స్నేహితులకు రంగులు చల్లుతూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువకులు, తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండలంలో హోలీ పండుగ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో, ఆయా గ్రామాల్లో యువతీ యువకులు, చిన్నారులు కుటుంబ సభ్యులతో కలిసి హోలీ నిర్వహించుకున్నారు. రాజోళిలో హోలీ అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఉల్లాసంగా వేడుకలు..

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉల్లాసంగా హోలీ నిర్వహించారు. చిన్నాపెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉదయం నుంచే యువకులు, మహిళలు, చిన్నారులు హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్దలు, యువకులు, చిన్నారులు హోలీ పండుగను కేరింతలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ధరూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో యువకులు రంగులతో హోలీ పండుగ చేసుకున్నారు. గద్వాల–రాయచూరు రహదారిలో చిన్నారులు, యువకులు గ్రూపులుగా ఏర్పడి వాహనదారులకు రంగులు చల్లారు.

రంగ్‌బర్‌సే..

గద్వాల అర్బన్ : గద్వాలలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి కాలనీలు, కూడళ్లలో ప్రజలు కామదహనం చేశారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచే జిల్లా కేంద్రంలో హోలీ వేడుకలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో రోడ్ల మీదకు చేరుకున్న యువకులు పరస్పరం రంగులు చల్లుకుంటూ పండుగ చేసుకున్నారు. కొందరు యువతులు పసుపు నీళ్ల, వివిధ రంగులతో హోలీ



చేసుకున్నారు. యువకులు రంగులతో కేరింతలు వేస్తూ తిరిగారు. హోలీ వేడుకల్లో చిన్నారులు, యువతలు, గృహిణులు వేడుకల్లో పాల్గొన్నారు.



గద్వాలలో హోలీ సంబురాలు



ఎర్రవల్లిలో రంగులతో హోళీ ఆడుతున్న చిన్నారులు.



మానవపాడులో

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో మహిళలు సమూహాలుగా ఏర్పడి హోలీ పాటలకు నృత్యాలు చేశారు. మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో విద్యార్థులు హోలీ ఆడుతూ సెల్ఫీలు దిగారు.



జూలెకల్‌లో రంగులు చల్లుకొని హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు



ఉండవెల్లిలో హోలీ ఆడుతున్న హమాలీ సంఘం నాయకులు



అయిజలో రంగులు చల్లుకుంటున్న యువకులు



అయిజలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

'ఎండుతున్న మొక్కలను పట్టించుకోండి'



మానవపాడు శివారు రోడ్డు పక్కనే ఎండి చెట్లు

మానవపాడు: తెలంగాణ హరితహారంలో భాగంగా హరితహార మొక్కలను నాటారు. నాటిన మొక్కలు ఏపుగా పెరగటంతో వేసవిలో సరైన నీరు మొక్కలకు అందించక ఎండిపోతున్నాయి. మానవపాడు, చెన్నిపాడు, మద్దూరు, కలుకుంట్ల, అమరవాయి గ్రామాల రోడ్ల వెంట హరితహారం మొక్కలకు నీరు లేక ఎండిపోతున్నాయి. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి మొక్కలకు నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.



చెన్నిపాడు శివారు ప్రాంతంలో రోడ్డు పక్కనే ఎండిన మొక్కలు

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

రాజోళి: ఉపాధి హామీ కూలీలకు పని చేసే చోట వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎండలు ముదురుతున్న వేళ ఖచ్చితమైన సమయాన్ని కేటాయించి, నిర్ణీత సమయానికే ఇంటికి చేరకునేలా వారికి సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పనులు నిర్వహిస్తున్న దగ్గర తప్పకుండా మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, టెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, వాటి ఆవశ్యకతను కూలీలకు తెలియచేసి వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియ జేయాలన్నారు.

వరి కోతలు షురూ

ధరూరు: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో ప్రధానంగా బోరుబావులు, కాల్వల కింద సాగు చేసిన పంటలు కోత దశకు వచ్చాయి. ముందస్తుగా పంట సాగు చేసుకున్న రైతులు రెండు రోజులుగా కోతలను ముమ్మరం చేశారు. మార్కెట్‌లో మొదటి పంటలకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులు కోతలపై దృష్టి సారించారు. రెండు రోజులుగా రాయచూరు మార్కెట్‌కు వరిధాన్యం పెద్ద ఎత్తున తరలిపోతోంది. గద్వాల మార్కెట్‌తో పోలిస్తే అక్కడ మంచి ధర లభిస్తుండడంతో



ధరూరులోని రైల్వే స్టేషన్ సమీపంలో వరి పంట కోత కోయిస్తున్న రైతు

రైతులు తాము పండించిన ధాన్యాన్ని రాయచూరుకు తరలించేందురే ఆసక్తి చూపుతున్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



గోమాతకు రంగులు చల్లి ఆహారం పెడుతున్న భక్తులు


శాంతినగర్: హోలీ పౌర్ణమి పర్వదినాన్ని పు రస్కరించుకుని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు, ఆలయ కమి టీ సభ్యుల ఆధ్వర్యంలో గోమాతకు రంగులు చల్లి హోలీ వేడుకలు ప్రారంభించారు. అనంతరం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి, స్పటిక లింగేశ్వరస్వామి, వేంకటేశ్వర స్వాములను ద ర్శించుకుని ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో గో సేవాసమితి అధ్యక్షులు శ్రీనివాసులు, పూర్ణిమ దంపతులు, కార్యదర్శి మాణిక్యం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు జైని లక్ష్మణస్వామి దంపతులు, గొల్ల వెంకట్రాములు, రంగయ్య, మహానంది, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా..



గట్టు: భారత్‌మాల రోడ్డు కోసం జోకన్‌గట్టు నుంచి సల్కాపురం, గట్టు వైపునకు కంకర తీసుకొస్తున్న టిప్పర్ సోమవారం సాయంత్రం అదుపు తప్పి వ్యవసాయ పొలంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. భారత్‌మాల రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే కంకర లోడ్‌తో టిప్పర్ సల్కాపురం నుంచి గట్టు వైపు వస్తోంది. ఈ క్రమంలో కొళాయిబావి దగ్గర మరో వాహనానికి దారి ఇవ్వబోయి రోడ్డు పక్కనే ఉన్న వరి మడిలో పడిపోయింది. దీంతో టిప్పర్‌లోని కంకర మొత్తం వరి పొలంపై పడిపోయి నాటిన మడి దెబ్బతిన్నది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్‌కు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వ్యాధినిరోధక టీకాలు వేయించండి



అయిజ: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. సోమవారం మండలంలోని బైనిపల్లిలో 385 పశువులకు వెటర్నరీ సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోట్లో, కాలి గిట్టలలో పుండ్లు ఏర్పడుతాయని, అవి మేత మేయలేక నీరసం పడిపోతాయని, నడవలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. వ్యాధి తీవ్రమైతే పశువులు చనిపోతాయని, వ్యాధి నిరోధక టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని సూచించారు.

అంధకారంలో కోతులగిద్ద

ధరూరు: మండలంలోని కోతులగిద్ద గ్రామం వీధిలైట్లు వెలగక అంధకారంలో మగ్గుతోంది. వీధిలైట్లు కాలిపోయి రెండు నెలలుగా గ్రామం చీకటిమయమైందని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రత్యేకాధికారుల పాలన రావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సెక్రటరీ, ప్రత్యేకాధికారులు సమస్యలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జోగుళాంబ శక్తిపీఠం: రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ఎస్ఐ నాగరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం దగ్గర పబ్లిక్‌తో మాట్లాడారు. రోడ్డు భద్రత విషయంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇటీవల ఇమాంపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదాలను కూడా ప్రజలకు గుర్తు చేశారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. అపరిచితులకు సెల్ ఫోన్ పాస్‌వర్డు ఓటీపీలు, బ్యాంకు అకౌంట్ నెంబర్లు ఇవ్వడం వంటివి చేయరాదన్నారు. కొత్త వ్యక్తుల అనుమానాస్పద కదలికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, ఏదేనీ అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లాడ్జీల నిర్వహకులకు ఆదేశాలు జారీ..

లాడ్జీలలో ఎవరైనా బస చేసేందుకు వస్తే వారి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగరాజు

దగ్గర ఆధార్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్ తీసుకోవాలని, వాటిని నిర్ధారించుకున్న తరువాతే అనుమతులు ఇవ్వాలని సూచించారు. వారు ఏ పని నిమిత్తం ఇక్కడికి వచ్చారు, ఎన్ని రోజులు ఉంటారు, తదితర విషయాలను తెలుసుకోవాలని సూచించారు. దొంగతనాలను నివారించేందుకు ప్రతి షాపు యజమాని సీసీ కెమెరాలను పెట్టుకోవాలని సూచించారు.

మూడు మండలాల్లో విద్యుత్ అంతరాయం

అయిజ: నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు మరమ్మతులు చేపడుతున్నామని, దానివల్ల మంగళవారం అయిజ, వడ్డేపల్లి, రాజోళి మండలాల్లోని కొన్ని గ్రామాలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టీఎస్ఎస్ పీడీసీఎల్ ఏడీఈ నీలి గోవిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ మండలంలోని 33/11 కేవీ వెంకటాపురం సబ్‌స్టేషన్ వద్ద మాన్‌దొడ్డి సబ్‌స్టేషన్ వైపు 33 కేవీ ఇన్, అవుట్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని, దానికోసం వెంకటాపురం సబ్‌స్టేషన్‌కు ఎల్‌సీ తీసుకుంటున్నట్లు తెలిపారు. దాని వల్ల అయిజ మండలంలోని వెంకటాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, పర్దీపురం, కిష్టాపురం, కురవపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి, ఉప్పల, ఉప్పల క్యాంప్, నౌరోజ్ క్యాంప్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల, రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నరసూరు పచ్చర్ల, గ్రామాలకు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ తెలిపారు. అయిజ మండలంలోని చిన్న తాండ్రపాడు నుంచి మేడికొండ 33/11 సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్నామని, లూజ్ లైన్లను సరిచేసేందుకు అవసరమైన ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు మేడికొండ గ్రామం, మేడికొండ శివారులోని పంటపొలాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరాకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం..

రాజోళి: మండల కేంద్రంలో పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు ఏఈ సందీప్ తెలిపారు. రాజోళిలోని న్యూ ఎస్సీ కాలనీ, పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఎల్‌టీ లైన్స్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న కాలనీ ప్రజలు



కాలనీవాసులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ విజయభాస్కర్

అయిజ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు ఎకర విస్తీర్ణంలో జమ్ము గడ్డి పొదలు వ్యాపించాయి. ఎవరో బీడీ కాల్చి పారేయడంతో జమ్ముగడ్డి పొదలు అంటుకున్నాయి. క్రమేపీ మంటలు వ్యాపించాయి. సమీపంలోనే గడ్డివాములు ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గమనించిన ప్రజలు అప్రమత్తమై, బిందెల్లో నీరు తీసుకొని మంటలు ఆర్పారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ విజయభాస్కర్ పరిశీలించారు. మంటలు మళ్లీ వ్యాపించకుండా ఉండేందుకు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.